# ఊహకి అందిన కథ

ఒక రౌండు పూర్తయింది !....

బాటిల్ మూత తీసి-  గ్లాసుల్లో మళ్ళీ కొంచెం కొంచెం విస్కీ పోసి నిండా నీళ్ళు కలిపాడు జగపతి.

ఒక ప్లేటులో 'బాయిల్డ్ ఎగ్స్' మరో ప్లేటులో ఆమ్లెట్లూ తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు పనికుర్రాడు.

బయట వర్షం మరీ ఎక్కువైంది. ఉండి వుండి కిటికీల్లోంచి దూసుకుంటూ వస్తున్న చలిగాలి వణుకు పుట్టిస్తోంది.

'చలిగా వున్నప్పుడు డ్రింక్ చేస్తే వెచ్చగా వుంటుందంటారు!'- బాయిల్డ్ ఎగ్గుని సన్నగా 'కట్' చేస్తూ అన్నాడు రాఘవ... అతగాడు పరిశుద్ధమైన బ్రాహ్మడు... అయినా మందులో వున్నప్పుడు మటనూ చికెనూ కూడా తింటాడు.

'నాకు మాత్రం బాగా చలివేస్తోంది!' చొక్కా కాలర్ని మెడ చుట్టూ బిగించుకుంటూ చెప్పేడు వర్మ.

అతని అవస్థను గమనించిన జగపతి- కిటికీలు మూసెయ్యమని కుర్రాడికి చెప్పాడు... ఆపని పూర్తిచేసి కుర్రాడు వెళ్ళిపోయాడు.

'వర్షం ఎక్కువైనట్టుంది... ఇంటికి ఎలా వెళ్ళటం?'- రాఘవ అన్నాడు.

'ఎలాగో అలా వెళ్లొచ్చులేవోయ్! అయినా మందు కొట్టేప్పుడు అనవసరమైన ఆలోచనలు పెట్టుకుంటే- కొట్టినమందు కిక్కివ్వకపోగా- కనీసం సోడా తాగినట్టు కూడా వుండదు!'- నవ్వుతూ చెప్పేడు జగపతి.

'పోనీ, నీ స్కూటరు ఇక్కడ వదిలెయ్... నాకార్లో డ్రాప్ చేస్తాను!'- ధైర్యం చెప్పాను రాఘవకి.

రాఘవ 'ఎల్లయిసీ'లో ఆఫీసరు.. ఈ మధ్యే పెట్రోలు ధర మండిపోతోందని 'ఫియట్' అమ్మేసి స్కూటరుకొన్నాడు... నాకు, వర్మకీ అంబాసిడర్లున్నాయి.

జగపతికి మాత్రం ఓ కారు, ఓ జీపూ కూడా వున్నాయి. వాటితో పాటు ఓ ఖరీదైన మేడ, వెలకట్టలేని వ్యాపారం వున్నాయి. అతనికి

యాభై ఏళ్ళవయసుంది. అందమైన రెండో భార్య ఆనందలక్ష్మివుంది. ఎన్ని వున్నా ఏమున్నా- పిల్లలులేనిలోటు అప్పుడప్పుడు అతనికళ్ళల్లో కనిపించే నిరాశలో చోటు చేసుకుంటూంటుంది.

ఎప్పటినించీ, ఎలా ప్రారంభమైందో సరిగా గుర్తులేదుకానీ— చాలాకాలంగా ఆదివారాల్లో సాయంత్రంపూట మేం నలుగురంకల్సుకుని, కార్డ్సు ఆడుకోవటం ఆతర్వాత రెండుమూడు పెగ్గులు విస్కీ తాగటం' అలవాటయింది. ఒక్కొక్క ఆదివారం ఒక్కొక్కరి ఇంట్లో ఈ ఏర్పాట్లు జరుగుతాయి. ఎవరింట్లో కలుసుకుంటే- వారే ఆ రోజు మందూ, విందూ ఏర్పాటు చేయాలి... అదీ మా ఒప్పందం!

'నేను త్వరలోనే మందు మానేద్దామనుకుంటున్నాను !'— రెండు నిమిషాల తర్వాత అన్నాడు రాఘవ.

'ఎందుకొచ్చిందీ ఆ దురాలోచన ?' అడిగాడు జగపతి.

'దురాలోచనకాదు.... దూరాలోచన!... మొన్నా మధ్య మా బంధువొకాయనపోయాడు విశాఖపట్నంలో... ఆయన- తాగుడువల్లనే పోయాట్ట!.... అందుకే మా ఆవిడ పోరుపెడుతోంది నన్ను మానెయ్యమని!'— చెప్పాడు.

'చూడు ఫ్రెండూ! వారానికోసారి ఇలా కొంచెంగా డ్రింక్ చేయటం ఆరోగ్యాన్ని పాడుచెయ్యదు సరికదా- మనల్ని మరింత ఆరోగ్యంగా వుంచుతుంది!'— అన్నాడు వర్మ.

ఇండియాలో మెడిసిన్ చదివి, అమెరికాలో ఎమ్మెస్ చేశాడు వర్మ.

అంతలో- ఏదో పెద్ద శబ్దం వినిపించింది. దూరంగా ఎక్కడో పిడుగు పడింది కాబోలు, రాఘవ కొంచెం భయపడ్డాడు.

వర్షం ఇంకా ఎక్కువైంది. కిటికీ అద్దంలోంచి అప్పుడప్పుడూ కళ్ళు మిరిమిట్లుగొలిపే మెరుపులు కనిపిస్తున్నాయి.

'ఆ మెరుపుల వెలుగుల్లో- తడిసిన అద్దాలవెనక గాలికి ఊగుతున్న ఆ చెట్లు— జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా కనిపించటంలేదూ?' అడిగాడు జగపతి.

'అలాంటి దెయ్యాల్ని నువ్వు ఎప్పుడైనా చూశావా?' రాఘవ ప్రశ్నించాడు.

'చూసే వుండాలి.... లేకపోతే అంత ఇదిగా ఎలా వర్ణిస్తాడూ? ఆమ్లెట్ ముక్కని నోట్లో వేసుకుంటూ అన్నాడు వర్మ.

'అవును.... చూశాను!'— గంభీరంగా అన్నాడు జగపతి.

అందరం ఒకసారి అతనివైపు ఆశ్చర్యంగా చూసేం.

'ఎప్పుడు చూశానో చెప్పమంటారా?'

'చెప్పు... విందాం!'— ఆసక్తిగా ముందుకువంగి అడిగేడు రాఘవ.

గ్లాసులోవున్న విస్కీని కాస్త 'సిప్' చేసి- ఓ సిగరెట్టు ముట్టించి చెప్పటం ప్రారంభించాడు జగపతి.

'ఓసారి బిజినెస్ మీద నేను విశాఖపట్నం బయల్దేరాను.... అప్పుడూ ఇలాగే విపరీతంగా వర్షం కురుస్తోంది... దానికితోడు చలిగాలి బంగాళాఖాతంలో వాయిగుండం ఏర్పడటంవల్ల ఇంకా రెండురోజులు అలాగే వుంటుందని రేడియోలో చెప్పారు. అయినా తప్పరిసరై బయల్దేరాను.

'రాత్రి పదిగంటలు దాటింది.... చలిగాలినీ, వర్షాన్నీ లక్ష్యపెట్ట కుండా ఎక్స్‌ప్రెస్ ముందుకు సాగిపోతోంది.' 'గ్లాస్ విండోస్' మూసేసి నా బెర్త్‌మీద బెడ్‌షీట్ పరచిపడుకున్నాను. నా సీటుకి ఎదురుగా వున్న బెర్త్‌మీద ఎవరో అప్పుడే రెండో జాము నిద్రలోవున్నారు. ఇకపై బెర్తులు రెండింటిమీదా ఎవరో మెడికల్ స్టూడెంట్స్ కాబోలు- రైలెక్కినప్పట్నించీ వరుసగా ఓఅరడజను బీర్లు తాగేసి- ఆరుగంటలకే నిద్రపోయారు.

'నీలంరంగు బెడ్‌లైట్ నిస్పృహతో వెలుగుతోంది. రైలుఎక్కడో ఆగింది. కండక్టరు అటుగా వెడుతూంటే- 'ఇదే స్టేషనూ?'_ అని అడిగాను. స్టేషనేదీకాదనీ, 'కాషనార్డరు' వుండటంవల్ల నెమ్మదిగా వెడుతోందని చెప్పాడు.

'నిద్రపోయే ప్రయత్నంలో వున్నాను.... బండీ మరీ నెమ్మదిగా వెడుతోంది_ అంతలో, ఒక వ్యక్తి లోపలకువచ్చాడు.... నాకుఎదురుగా బెర్తుమీద నిద్రపోతున్న వాని కాళ్ళదగ్గర కూర్చున్నాడు.... బండి ఏ స్టేషన్‌లోనూ ఆగందే అతను ఎలా ఎక్కాడో అర్థంకాలేదు....

'ఒకవేళ పక్క 'రూం'లోని వాడేమో!.. అయినా అన్నీ రిజర్వ్‌డ్ బెర్తులయినప్పుడు ఒక రూంలోని మనిషి మరో 'రూం'లోకి రావలసిన అవసరం మాత్రం ఏముంటుంది?

'అతను ప్యాంట్ జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించాడు.... ఆ వెల్తురులో అతన్ని స్పష్టంగా చూడగలిగాను... తెల్లటి బట్టలో అందంగానేవున్నాడు.

'ఏ ఊరు వెళ్ళాలి?'– ఇంగ్లీషులోనే అడిగాను.

'చాలా దూరం వెళ్ళాలి.... మీరు విశాఖపట్నం కదూ?'– అడిగాడు.... నేను తెల్లబోయాను అతనికెలాతెలుసునా అని.

'రిజర్వేషన్ ఛార్టులో చూశాన్లెండి!.... అందుకే వచ్చాను.... విశాఖపట్నంలో మీరు నాకో సహాయం చేయాలి!'– మళ్ళీ వెంటనే అన్నాడు.

'ఏమిటీ?.... అనుమానంగా చూశాను.

'యూనివర్శిటీకి వెనకాల శ్రీనివాసమహల్ అని ఓ మేడవుంది. అది నాదే!... ఈ లెటర్, ఆ ఇంట్లో వున్న నా భార్యకు అంద చేయాలి!.... జర్నీ బ్రేక్ చేసి స్వయంగా నేనే రావటానికి అవకాశం లేదు... అందుకే మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నాను....' సిగరెట్టును యాష్‌ట్రేలో నలిపేసి- జేబులోంచి ఓ కవరు తీసినాకు అందిస్తూ చెప్పాడు.

అప్రయత్నంగానే తీసుకున్నాను... కవరుమీద నల్లటి అక్షరాలతో 'రాజీ' అని రాసివుంది.

అంతలో రైలు ఏదోస్టేషన్లో ఆగింది.

'మరినేను వస్తాను.... మీరు మరచి పోకుండా నాకీ సహాయం చేయాలి.... శలవు!'– రూంలోంచి బయటకు వెళ్ళిపోతూ హెచ్చరికగా అన్నాడు.

'మర్నాడు పొద్దున్న తొమ్మిదయ్యేసరికి విశాఖపట్నం చేరుకున్నాను. ఆరోజంతా నాపనితోనే సరిపోయింది. రెండోరోజు సాయంత్రం నాలుగ్గంటలకు టాక్సీలో శ్రీనివాసమహల్‌కి బయల్దేరాను.

'చాలా పెద్ద భవంతి అది!.... విశాలమైన కాంపౌండు.... లోపల గులాబీలతోట!.... తోటమాలికాబోలు మొక్కలకి నీళ్ళుపెడుతున్నాడు. గేటు తీసుకుని లోపలకు వెళ్ళగానే 'ఎవరుకావాలిబాబూ?' అంటూ అతను ఎదురొచ్చాడు.

'అమ్మగారికోసం!' చెప్పాను.

అతను లోపలకు వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగొచ్చి నన్ను లోపలకు తీసుకెళ్ళాడు. ఆ హాలు చాలా విశాలంగా వుంది... గోడ మీద అందమైన డ్రాయింగ్స్ అలంకరించబడివున్నాయి.... హాలుమధ్య నాలుగు సోఫాలు... ఒక సోఫాలో నడివయస్కురాలొకామె కూర్చుని వుంది.

'నన్ను చూడగానే'– రండి.... కూర్చోండి!' అంటూ సాదరంగా ఆహ్వానించింది. ఆమెకు ఎదురుగావున్న మరోసోఫాలో కూర్చున్నాను.

'రాజీగారు కావాలి!'– అడిగేను.

'నేనే.... ఏమిటో చెప్పండి!'–

క్షణం నిశ్చేష్టుణ్ణయ్యాను... ఆమెనుదుట కుంకుమలేదు. మెడలో మంగళసూత్రం వున్న ఛాయలు కూడా కన్పించలేదు.... అనుమానంగానే అడగబోయాను–

'మీరు శ్రీనివాసరావుగారి–

'అవును!... శ్రీనివాసరావుగారి భార్యనే నేను... వారు పోయి మూడు నెలలయింది... మీకు తెలియదనుకుంటాను!'

'నాసోఫా ప్రక్కనే ఆటంబాంబు ప్రేలినట్టయింది... నేను పొరపాటున ఒక ఇంటికి రావల్సింది మరో ఇంటికి వచ్చానేమోననే అనుమానం కూడా కలిగింది. కానీ వీధిలో కాంపౌండ్ గోడమీద 'శ్రీనివాసమహల్' అనే పేరు వుండనే వుంది.... 'రాజీ' తనేనని ఆవిడ ఒప్పుకుంది... మరి శ్రీనివాసరావుగారు పోయి మూడు నెలలయిందంటుందేమిటీ?

నాకు పిచ్చెక్కినట్టయింది.

'నిన్న రాత్రి నాకు శ్రీనివాసరావుగారు కనిపించారు.... మిమ్మల్ని కలుసుకుని ఈ కవరు అందచేయవల్సిందిగా నన్ను 'రిక్వెస్ట్' చేశారు. జేబులోంచి కవరు తీస్తూ చెప్పేను.

'అసంభవం!' గట్టిగా అరచిందావిడ.

కోపంతో ఆమె ముఖం ఎర్రనైంది. ఏంబదులు చెప్పాలో అర్థంకాలేదు నాకు. అంతలోనే నా దృష్టి అప్రయత్నంగా- గోడన వేలాడుతున్న ఓ ఫొటో మీద పడింది.

'ఆ ఫొటోలోవున్నది శ్రీనివాసరావ్‌గారే కదూ?' అడిగాను ఫొటో చూస్తూ.

'అవును!... ఓసారి ఆగ్రావెళ్ళినప్పుడు తాజ్‌మహల్ దగ్గర ఆయనకి నేనే ఫొటో తీశాను. బాగా వచ్చిందని 'ఎన్‌లార్జ్' చేయించారు... ఆతర్వాత ఆరునెల్లకే ఆయన నాకు దూరమయ్యారు. ఆఫోటో ఒక్కటే ఆయన జ్ఞాపకార్థం ఓతీపిగురుతుగా నాకు మిగిలిపోయింది..' ఆవిడ కన్నుల్లో కన్నీరు నిలిచింది.

'మొన్నరాత్రి నాతో మాట్లాడింది శ్రీనివాసరావ్‌గారే!.... సందేహంలేదు'— దృఢంగా చెప్పాను.

నా మాటవిని ఆవిడ విరక్తిగా నవ్వేసింది.

'మీకు పిచ్చిపట్టినట్టుంది... నన్ను మాత్రం పిచ్చిదాన్ని చేయకండి... వారు పనిమీద కలకత్తా వెడుతూ రైల్లోనే గుండెపోటువచ్చి పోయారు... వారి అంత్యక్రియలు నాకళ్ళముందు జరిగాయి!'

నేను తెల్లబోయి ఆవిడవైపు చూస్తూంటే మళ్ళీ చెప్పసాగింది.

'ఆరోజు సాయంత్రం వారు కలకత్తా వెడుతూంటే వారితో నేనూ స్టేషన్‌కి వెళ్ళేను. రైలు అరగంట లేటుగా వచ్చింది. ఆయనకు ఫస్టు క్లాసులో రిజర్వేషన్ 'కన్‌ఫర్మ్' కాలేదు. కండక్టర్‌తోటీ. టీసీతోటీ ఘర్షణపడ్డారు. మొత్తానికి ఎలాగో రిజర్వేషన్ దొరికింది. రైలు వెళ్ళిపోయింతర్వాత నేను ఇంటికొచ్చాను. రాత్రి సుమారు రెండు గంటలవేళ నాకు మెసేజ్ వచ్చింది... 'వారికి గుండెపోటువచ్చి రైల్లో మరణించారనీ— వాల్తేరు స్టేషన్‌కి 'డెడ్‌బాడీ'ని పంపుతున్నారనీ'—

రైల్వే అధికారులు నాకు తెలియచేశారు... అప్పటికప్పుడు మా అన్నయ్యను పిలిపించి ఇద్దరం స్టేషన్‌కివెళ్ళి- తెల్లవారిన తర్వాత వారి మృతదేహాన్ని స్వయంగా తీసుకొచ్చాం.'

ఆవిడ చెప్పిన మాటలువింటే అబద్ధమనిపించలేదు. అయినా అబద్ధమాడవలసిన అవసరంకూడా ఆమెకు ఉన్నట్టు తోచలేదు.... మరి నాకు కనిపించిన శ్రీనివాసరావుమాటేమిటి ?...

తలచుకోవటానికే భయంకలిగింది.

'ఈ కవరు మీకిమ్మని శ్రీనివాసరావుగారు ఇచ్చారు!'— చేతిలో వున్న కవరు ఆవిడకు అందించాను.

దాన్ని అందుకుని పైనున్న అక్షరాలు చూసింది.

'అవును!... ఆయనొక్కరే నన్ను ఈపేరుతో పిలిచేవారు!'— అని గొణుక్కుంటూ, కవరు చించి, అందులోవున్న కాగితాన్నితీసింది ఆ ఉత్తరం చదువుతున్నంతసేపూ, మారుతున్న ఆమె ముఖకవళికల్ని గమనిస్తూనే వున్నాను.

'అవునండీ!... నిజమే.... మీరు చూసింది వారినే!.... ఇదిగో మీరూ చదవండి!'— ఆకాగితాన్ని నాకు అందించింది. ఆతృతగా చదివాను.

'రాజీ....

ఈ ఉత్తరం నేను రాశానంటే నువ్వు నమ్మివుండవ్... కానీ నేనేరాశాను. నీకు చెప్పవలసిన చివరి మాటలూ, చేయవలసినపనులూ

కొన్ని మిగిలిపోయాయి.... వాటికోసం నా ఆత్మ అశాంతితో ఊగి పోతోంది. అసలు బ్రతికుండగానే నీకు ఓ భయంకరమైన నిజాన్ని చెప్పాలనుకున్నాను రాజీ!... కానీ సున్నితమైన నీ మనసు గాయపడు తుందని భయపడి— ఆ నిజాన్ని నాలోనే దాచుకున్నాను.

'పెద్దల సమక్షంలో నీ మెడలో తాళికట్టటానికి కొన్ని సంవత్స రాలముందే నేను శ్యామలను పెళ్ళి చేసుకున్నాను... గుళ్ళోపెళ్ళి!.... అప్పటి పరిస్థితుల్లో మేం రహస్యంగానే జీవించవలసివచ్చింది. ఆర్థి కంగా ఎన్నో ఇబ్బందులకులోనయ్యాం.

'అప్పుడే శ్యామల, తన ఒంటిమీది నగలన్నీ ఇచ్చేసింది నాకు. వాటిని అమ్మేసి అడబ్బుతో వ్యాపారం ప్రారంభించాను. అదృష్టం కలి సొచ్చింది .. వద్దంటే వచ్చింది డబ్బు!.... కానీ, ఆ సంపదనీ, సంతో షాన్ని అనుభవించకుండానే నన్ను విడిచి శ్యామల శాశ్వతంగా వెళ్ళి పోయింది...

'వెళ్ళిపోతూ మూడు నెలల బాబుకి నన్నే తల్లినీ, తండ్రినీ చేసి మరీ వెళ్ళిపోయిండి.... నా వ్యాపార వ్యవహారాల్లో— బాబును అంతగా పట్టించుకునే అవకాశం దొరికేదికాదు. పైగా అప్పుడే మావాళ్ళు నీతో నా పెళ్ళి స్థిరపరిచారు... గత్యంతరంలేక బాబుని హైదరాబాద్‌లోవున్న అనాథశరణాలయంలో చేర్చాను....

అక్కడితో ఆ అధ్యాయం ముగిసిపోయిందని తృప్తిపడగలిగితే బాగుండేది. అదే జరగలేదు. ఎంత సంపాదిస్తున్నా ఏదో అశాంతీ, దిగులూ నాలో చోటు చేసుకున్నాయి. బాబుని దిక్కులేనివాడిగా చేసి, నన్ను నిలబెట్టిన శ్యామలకు ద్రోహం చేశాననిపించేది.... అసలు బాబుకి

నేను చేసిన అన్యాయానికి శిక్షగా, నాకు గుండెపోటు సంప్రాప్తించిందేమో!... దాంతో నా ప్రాణాలమీద నాకే నమ్మకంపోయింది. ఏ క్షణంలోనైనా గుండెపోటు నా ప్రాణాలు తీస్తుందని నాకు తెలుసు.

అందుకే నాఆస్తి నీకూ, బాబుకీ సమానంగా చెందాలని వీలునామా రాశాను. మనపడగ్గదిలో పట్టెమంచం క్రిందనున్న నల్లటి నాపరాయిని తొలగిస్తే- దానికింద ఒకపెట్టెవుంటుంది. అందులో కొన్ని విలువైన నగలూ ఆవీలునామా జాగ్రత్తగా వుంచాను.

ఇంతకీ అసలు విషయం చెప్పనేలేదు... బాబుకి ఈపాటికి పదిహేనేళ్ళ వయసుంటుంది కుడికంటి క్రింద ఎర్రటి పుట్టుమచ్చవుంది. వాడిలో నా పోలికలు కూడా కనిపిస్తాయి. అనాధాశ్రమం నించి వాణ్ణి తీసుకొచ్చి– నువ్వైనా వాడిచేత 'అమ్మా'అనిపించుకో రాజీ... ఇది నా ప్రార్ధన!....

ఇక నేనుంటాను!'

'అవుత్తరం చదువుతూంటే నాకు నిజంగానే మతిపోయింది. దెయ్యాలుంటాయని ఎవరైనా చెబితే హేళన చేసేవాణ్ణి...

మరి ఇప్పుడూ?...

'ఓసారి నాతోరండి!' అంటూ ఆవిడలేచింది.

నేను అనుసరించాను. ఎడంచేతి ప్రక్కనేవున్న గదిలోకి వెళ్ళాం.

'కొంచెం సహాయం చేయండి!'– పట్టెమంచాన్ని పక్కకుజరుపుతూ అడిగిందావిడ ఇద్దరం కలసి, అతికష్టంమీదనల్లటి ఆ నాపరాయిని తొలగిం

చాం... దాని కింద అందమైన దంతంపెట్టె కనిపించింది... అందులో నగలూ, వీలునామా వున్నాయి!

* * *

'ఇప్పుడు చెప్పండి... నేను దెయ్యాన్ని చూశానంటే మీరు ఒప్పుకుంటారా ?' కథ చెప్పటం ముగించి అడిగాడు జగపతి నవ్వుతూ.

'కరెక్టే! కోరుకున్నది జరక్కుండా చచ్చిపోతే– వాళ్ళ ఆత్మలు అలాగే తిరుగుతూ వుంటాయట... అవే దెయ్యాలుగా కనిపిస్తాయట... మా బామ్మ చెప్పేది!'– అన్నాడు రాఘవ.

వర్షం వెలిసింది... అందరం లేచాం...

ఆ తర్వాత నాలుగయిదు వారాలు గడిచిపోయాయి....

ఆరోజు ఆదివారం!

సాయంత్రం. అందరం రాఘవ ఇంట్లో కలుసుకోవాల్సివుంది. అయిదయ్యేసరికి వాళ్ళింటికి చేరుకున్నాను. అప్పటికే అక్కడవున్నాడు వర్మ.

ముగ్గురం రమ్మీ మొదలుపెట్టేం... సమయం గడుస్తోంది.

'ఏదయినా జగపతి రాలేదెందుకో ?' ముక్కలు పంచుతూ అన్నాడు వర్మ.

సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది.

రాఘవ ఫోనందుకున్నాడు.

ఒక నిమిషంపాటు ఫోన్లోమాట్లాడి తిరిగొచ్చి—

'సారీ ఫ్రెండ్స్! మన జగపతికి 'హార్టెటాక్' వచ్చిందట.... హాస్పిటల్లో అడ్మిట్ చేశారట... మనం వెళ్లాలి!'— అన్నాడు ఆందోళన నిండిన స్వరంతో.

మరోపావుగంటకి ముగ్గురం ఆస్పత్రికి చేరుకున్నాం.

అప్పటికే అంతా అయిపోయింది.

ఆరాత్రి మేం డెడ్‌బాడీని ఇంటికి తీసుకొచ్చి— ఆనందలక్ష్మిగార్ని ఓదారుస్తూ అక్కడే వుండిపోయాం ....

మర్నాటి సాయంత్రానికి బంధువులందరూవచ్చారు. జగపతి అన్నకొడుకు కాటోలు కర్మకాండ జరిపించాడు.

పదకొండోరోజున ఆనందలక్ష్మిగారు కబురుపెడితే వాళ్ళింటికి వెళ్ళేను.... అప్పటికే అక్కడ వర్మా, రాఘవా వున్నారు.... మమ్మల్ని పిలిపించటానికి గలకారణం ఏమిటో ఎవరికీ అర్థంకాలేదు. జగపతిని గురించిన జ్ఞాకాలు ఆవేదన కలిగిస్తూంటే నిశ్శబ్దంగా కూర్చున్నాం....

అంతలో మేడపైనించి ఆనందలక్ష్మిగారు క్రిందకువచ్చారు.... మాకు కొంచెం దూరంలోవున్న సోఫాలో కూర్చున్నారు.

'మీరు నాకో సహాయం చేయాలి!'— మా ముగ్గురివైపూ చూస్తూ నెమ్మదిగా అడిగారావిడ.

'చెప్పండి!' ఆసక్తిని కనబరిచేడువర్మ.

'మావారికి మీరంటే చాలా ఇష్టం.... అందుకే ఈ పని మీకు చెప్పబోతున్నాను'— ఆవిడ కళ్ళల్లో కన్నీరు కదుల్తోంది.

రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత మళ్ళీ చెప్పసాగేరు—

'నాతో పెళ్ళికాని క్రితమే ఆయన మరొకర్ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు— గుళ్ళోపెళ్ళి...'

మేం ముగ్గురం నిశ్చేష్ఠులమై వింటున్నాం.

'బహుశా ఈ విషయం మీకూ తెలియదనుకుంటాను... నాకూడా తెలియపరచకుండా ఈరహస్యాన్ని ఆయన ఇంతకాలం గుండెల్లోనే దాచుకున్నారు... గుండెపోటువచ్చి ఆస్పత్రిలో చేర్చినప్పుడు— చెప్పారు.... ఆవిడపేరు శ్యామల!'

'ఆవిడ ఎక్కడుందిప్పుడు?'— అడిగాను ఆత్రంగా.

"లేదు....చనిపోయి చాలాకాలమైంది. ఆవిడకు పుట్టిన బాబు మాత్రం ఇప్పుడు హైద్రాబాదులోని ఓ అనాధాశ్రమంలో పెరుగుతున్నాడు!"

"అనాధాశ్రమంలోనా?"

'అవును...శ్యామల చనిపోయిన తర్వాత-బాబుని అక్కడ చేర్చారట... ఒకనాడు శ్యామ ఒంటిమీద నగలన్నీ అమ్మి ఆ డబ్బుతో వ్యాపారం ప్రారంభించటం వల్లనే-ఇవాళ ఇంత ఆస్థి సంపాదించగలిగానని చెప్పారాయన!... ఈ నిజాన్ని నాతో చెప్పటానికి ఇంతకాలం ఆయన భయపడ్డారు ఇప్పుడు ఆ బాబుని తీసుకొచ్చి వాడిచేత నన్ను

'అమ్మా' అని పిలిపించుకొమ్మని కోరారు... ఇది వారి చివరి కోరిక! మీరు వెంటనే హైదరాబాద్ వెళ్ళి ఎలాగైనా ఆ బాబుని తీసుకురావాలి!'- చెప్పటం ముగించి మావైపు ఆశగా చూశారావిడ.

'కానీ ఆ బాబుని ఎలా గుర్తు పట్టటం?'- రాఘవకి మంచి అనుమానమే వచ్చింది....

'చాలా సులువు' వాడికి పదిహేనేళ్ళుంటాయి... కుడికంటికింద ఎర్రటి పుట్టుమచ్చ కనిపిస్తుంది....అచ్చం వారి పోలికలోనే వుంటాడట! ఒకవేళ ఇప్పుడు ఆశ్రమంలో ఉండకపోతే—ఎక్కడుంటున్నదీ తెలుసుకుని ఎలాగైనా తీసుకురావాలి!'

'రేపే బయల్దేరి వెడతాం' - అన్నాడు రాఘవ....

'అయితే ఆరోజు జగపతి చెప్పిన కథ వట్టిదేనన్నమాట!.... నిజంగా దెయ్యాన్నిచూసే వుంటాడనుకున్నాను సుమా!'- బైటకు వచ్చిన తర్వాత మాతో అన్నాడు వర్మ.

'తన గుండెల్లో దాచుకున్న ఓ భయంకర నిజాన్ని భార్యకి చెప్పకుండా మరణిస్తే - ఏం జరగచ్చో ఊహించి మనకు కథగా చెప్పాడు' అంటూ ముందుకి నడిచాడు రాఘవ!!

* * *

విజయ....
జూలై 1980.